నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల
వనపర్తి
3 | మహబూబ్‌నగర్, శనివారం 8 జూన్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


చేపలు శుభ్రం చేస్తున్న విక్రయదారులు

# మృగశిర ఆగమనం

- ఈ కార్తెకు పురాణాల్లోనూ విశిష్టత
- కార్తె రోజున చేపల పులుసు, తినాల్సిందే..
- నాటుకోళ్లకు యమ డిమాండ్

గద్వాల టౌన్, జూన్ 7 : భారతీయ జ్యోతిష్య సంప్రదాయం ప్రకారం ఒక్కో నక్షత్రం, కార్తె, రాశికి ప్రత్యేకత ఉంటుంది. అందులో మృగశిరానికి మరింత విశిష్టత ఉన్నది. రోహిణి కార్తెతో రోళ్లు పగిలే ఎండలతో సతమతమైన జీవకోటికి మృగశిరం చల్లని కబురును చెబుతుంది. ఈ కార్తెలోనే రుతుపవనాల ఆగమనం జరుగుతుంది. అందువల్ల ఈ కార్తెను రైతులు ఏరువాకసాగే కాలం అంటూ సాగు పనులు చేపడుతారు. అదేవిధంగా ఈ కార్తెలో చేపలు విరివిగా తినడం వల్ల చాలా రోగాలు నయమవుతాయనే నమ్మకంతో అదే రోజున చేపమందును తీసుకోవడం కూడా ఆనవాయితీగా వస్తోంది. అంతేకాక మృగశిర కార్తెకు పురాణాల్లో కూడా ఎంతో విశిష్టత ఉన్నది. ఈ కార్తె గురించి భగవద్గీత, పురాణాల్లో ప్రత్యేక స్థానం ఉండడం విశేషం...

మృగశిర కార్తెను ప్రతి ఏడాది జూన్ మాసంలో జరుపుకొంటారు. సూర్యుడు మృగశిరంలోకి ప్రవేశంచడంతో ఆ కార్తెను మృగశిరకార్తెగా పిలుస్తారు. అదేవిధంగా మృగశిర నక్షత్రానికి చంద్రుడు 14 రోజుల సమీపంలో ఉంటాడు. అందుకు గానూ మృగశిర అనే పేరు వచ్చింది. ఈ కార్తెలోనే నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశిస్తాయి. రోహిణి కార్తెలో ఎండలతో సతమతమైన జీవకోటికి ఈ కార్తె చల్లని వాతావరణాన్ని అందిస్తుంది. తొలకరి జల్లులు కురిసి పుడమి చల్లబడి సాగుకు అనుకూలంగా మారుతుంది. దీంతో రైతన్నలు ఏరువాక సాగు పండగను ప్రారంభిస్తారు. వానలు ముందుగా కురవడంతో కాలం కలిసొచ్చినట్లేనంటూ రైతులు సాగును సంతోషంగా ప్రారంభిస్తారు. మృగశిర కార్తె మొదటి రోజును దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మృగశిర, మృగం, మిరుగు, మిర్గం అనే పేర్లతో పిలుస్తారు. ఈ రోజు బెల్లంలో ఇంగువను కలుపుకుని తింటారు. ఇది శరీరంలో ఉష్ణోగ్రతను ప్రేరేపించి వర్షాకాలంలో సోకే వ్యాధులను అడ్డుకుంటుందని పెద్దల నమ్మకం.

### చేపలకు యమ డిమాండ్..

మృగశిర కార్తెలో చేపలు తినడం మన పెద్దల నుంచి వస్తున్న ఆనవాయితీ. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో వేడిని పుట్టించేందుకు చేపలను తింటారు. అంతేకాక చేపలు తినడం వల్ల ఉబ్బసం, ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. అలాగే కొత్త నీరు వచ్చి చేరడంతో రోగాలు సోకే అవకాశం ఉన్నది. దీంతో రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుంది. రోగాల బారి నుంచి కాపాడుకుంటూ, రోగ నిరోధకశక్తిని పెంచుకోవాలంటే చేపలు తినాల్సిందేనని పెద్దలు చెప్తుంటారు. ఈక్రమంలో చేపలకు ఫుల్ డిమాండ్ ఉంటుంది.

### నడిగడ్డలో స్పెషల్..

నడిగడ్డలో మృగశిర కార్తె రాకను పెద్ద పండుగలా నిర్వహిస్తారు. కార్తె నాడు నల్లకోడి తినాల్సిందేనని మాంసాహార ప్రియులు ఎంత ధరనైనా చెల్లించేందుకు సిద్ధంగా ఉంటారు. దీంతో మార్కెట్లో ఒక్కో నల్లకోడి ధర రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు ఉంది. శాకాహారులైతే మామిడిపండ్ల రసం, అట్లు తినడం నాటి నుంచి వస్తున్న ఆనవాయితీ.

# నిరంజన్‌రెడ్డి కృషి ఎనలేనిది..


మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి దంపతులు

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

వనపర్తి, జూన్ 7 : తన గెలుపు కోసం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని స్థానికసంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి నివాసంలో ఆయనను ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి దంపతులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ ఎన్ని కుట్రలు చేసినా, ప్రజాప్రతినిధులను ప్రలోభపెట్టినా.. సమర్థవంతంగా ఎదుర్కొని రాజకీయ చతురతో తనను గెలిపించారన్నారు. వారి మార్గదర్శకత్వంలో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని, స్థానిక సంస్థల నాయకుల హక్కుల కోసం కూడా పోరాడుతానని ఆయన ప్రకటించారు.

# రాష్ట్రస్థాయిలో రాణించిన మహేశ్వరి

- పరుగు పోటీలో ప్రథమస్థానం
- హర్షం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, జూన్ 7 : రాష్ట్రస్థాయి అండర్-18 పరుగు పందెంలో మండలంలోని వెల్కిచర్లకు చెందిన మహేశ్వరి ప్రథమస్థానంలో నిలిచింది. హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బుధవారం నిర్వహించిన 3 కిలోమీటర్ల పోటీలో 10నిమిషాల 55 సెకండ్లు, గురువారం జరిగిన 1,500 మీటర్ల పరుగులో 5నిమిషాల 4సెకండ్లలో పరుగుగెత్తి ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మహేశ్వరికి శుక్రవారం ఒలంపిక్ కోచ్ రమేశ్ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపీపీ శేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న మహేశ్వరి

## ఎదురు చూపు !


నైరుతి రుతుపవనాల రాకతో అందరూ వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. అక్కడక్కడా వానలు కురుస్తున్నా నదులు, చెరువులు వట్టిపోయే కనిపిస్తున్నాయి. ఈక్రమంలో మండలంలోని రంగాపురం వద్దనున్న కృష్ణానది సైతం మట్టి, రాళ్లు తేలి కనిపిస్తున్నది. ఎగువనున్న ప్రాజెక్టులు నిండి వరద వస్తేనే జూరాల జలకళను సంతరించుకుంటుంది. ఈ ప్రాజెక్టు నుంచే శ్రీశైలానికి వరద మొదలవుతుంది. – పెబ్బేరు, జూన్ 7

# గుర్రాల బీభత్సం

- దాడిలో బాలుడికి గాయాలు

మహ్మదాబాద్, జూన్ 7 : గుర్రాల దాడిలో బాలుడు గాయపడిన ఘటన మహ్మదాబాద్ మండలం మొకర్లబాద్ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలో రెండు మూడు రోజులుగా మూడు గుర్రాలు హల్‌చల్ చేస్తున్నాయి. అడ్డొచ్చిన వారిని గాయపరుస్తున్నాయి. ఈక్రమంలో గ్రామానికి చెందిన బాలుడు గొల్ల అరవింద్‌ను శుక్రవారం కరవడంతో దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండంలం ఘనపూర్‌లో ఆరుగురిని గాయపర్చగా వాటిని తరిమేశారు. దీంతో ఆ గుర్రాలు మండలంలో చిన్నాయిపల్లిలో పలువురిని గాయపర్చి మొకర్లబాద్‌లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుర్రాల బారి నుంచి తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గుర్రం కరవడంతో గాయపడిన బాలుడు


జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామ సమీపంలోని పొలాల్లో విత్తనాలు విత్తుతున్న రైతులు

# రుతురాగం

## కమ్మేసిన నైరుతి రుతుపవనాలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- తొలకరిలో 'సాగు'దాం
- వానకాలం సీజన్‌పై రైతన్నల ఆశలు
- ఇప్పటికే పొలాల్లో దుక్కులు సిద్ధం
- ఎరువులు, విత్తనాల కొనుగోళ్లలో కర్షకుల బిజీబిజీ

### పులకించిన పాలమూరు..

నైరుతి పవనాల ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. వానకాలం ప్రారంభానికి ముందే తొలకరి పలకరించింది. గతేడాది జూలై, ఆగస్టులో వానలు కురవగా అన్నదాతలు ఆలస్యంగా సాగు ప్రారంభించారు. ఈసారి వర్షాలు ముందుగానే కురుస్తుండడంతో పొలాలు వర్షపునీటితో తడిసిపోతున్నాయి. దీంతో రైతులు వరి నాట్లు వేసేందుకు, ఇతర పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. గతేడాదికి మించి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో అన్నదాతలు పెద్ద ఎత్తున సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. అక్కడక్కడా విత్తనాల కొరత వచ్చినా రైతులు ప్రైవేట్‌గానైనా విత్తనాలను కొని సాగుకు సంసిద్ధమవుతున్నారు.


ప్రైవేట్ దుకాణాల్లో సిద్ధంగా ఉన్న ఎరువులు

మహబూబ్‌నగర్, జూన్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. అన్ని జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. వారం ముందుగానే నైరుతి రుతుపవనాలు పాలమూరును తాకడంతో అన్నదాతలు ఆనందంతో పొంగిపోతున్నారు. రికార్డు స్థాయి వేడిమిని తట్టుకోలేక విలవిల్లాడిన జనం వాతావరణం చల్లబడటంతో ఒక్కసారిగా ఉపశమనం పొందారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో ఈదురుగాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. వీటికి పిడుగులు తోడై ఇప్పటివరకు 12 మంది ప్రాణాలు కోల్పోగా.. మూగజీవాలు సైతం బలవుతున్నాయి. అక్కడక్కడా సమృద్ధిగా వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై సాగుకు సిద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల వాగులు, వంకలు పొంగుతుండగా.. మరికొన్ని చోట్ల కురుస్తున్న పదును వానకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కేసీఆర్ హయాంలో వానకాలం ప్రారంభానికి ముందే ఖాతాల్లో రైతుబంధు జమ చేసేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేయకపోవడంతో అన్నదాతలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రైతులకు రుణాలివ్వడానికి బ్యాంకులు సైతం ముందుకు రాకపోవడంతో ప్రైవేట్ అప్పులు తప్పడం లేదు. గత యాసంగి రైతులను నిరాశకు మిగల్చగా.. కరెంట్ కోతలు కుంగదీస్తున్నాయి. చిన్నపాటి వర్షానికి కరెంటు తీస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల నారుమళ్లు ఎండిపోయే పరిస్థితి దాపురించింది.

***ఈదురుగాలులు.. పిడుగుపాట్లు..***

ఒకవైపు తొలకరి పలకరిస్తుంటే.. మరోవైపు తుఫాన్ ప్రభావంతో పలు చోట్ల పిడుగుపాటుకు మనుషులు, జీవాలు బలవుతున్నాయి. వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో వివిధ ఘటనల్లో 12 మంది చనిపోయారు. నాగర్‌కర్నూల్‌లో గోడ కూలి నలుగురు ప్రాణాలు కోల్పోగా.. పలుచోట్ల పిడుగుపాటుకు ఎనిమిదిమంది మృతిచెందారు. ఇటు కుటుంబసభ్యులు.. అటు మూగజీవాలు కండ్ల ముందే చనిపోతుంటే అన్నదాతల ఆవేదన అంతా ఇంతా కాదు..

***పత్తాలేని రైతు భరోసా..***

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్షగట్టింది. వానకాలానికి అవసరమైన పెట్టుబడి కోసం అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం సీజన్ ప్రారంభానికి ముందే టింగ్ టింగ్ మంటూ రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేసేది. అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ గత యాసంగిలోనే రైతులకు మొండి చేయి చూపింది. ఈసారి వానకాలం ప్రారంభమవుతున్నా రైతు భరోసా జాడేలేదు. పెట్టుబడి కోసం రైతాంగం బ్యాంకుల చుట్టూ తిరిగితే బ్యాంకర్లు కూడా అప్పు ఇవ్వకపోగా వడ్డీతో సహా తీర్చాలని నోటీసులిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యలంటూ విద్యుత్‌శాఖ అధికారులు చిన్నపాటి వర్షానికే కరెంట్ తొలగిస్తుండడంతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నది. నాట్లు వేసేందుకు నారుమళ్లు సిద్ధం చేసుకున్నా.. నీళ్లు సరిపోక ఎండిపోయే పరిస్థితికొచ్చాయి. కష్టాల కడలిలో సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు.

**కరెంట్ కోతలతో ఆగమాగం**


జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం పల్లెపాడులో సాళ్లు కొడుతున్న రైతన్నలు

# పలుచోట్ల భారీ వర్షం

- ఉప్పొంగుతున్న వాగులు, వంకలు
- అలుగు పారుతున్న చెరువులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాత

అమ్రాబాద్, జూన్ 7 : నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్‌తోపాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి కుండపోత వర్షం కురిసింది. పది రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకు ఆయా గ్రామాల్లోని చెరువుల్లోకి వరద చేరుతుండగా.. గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి బీకే తిర్మలాపూర్ చెరువు నిండుకుండలా మారింది. మొల్కమామిడిలోని బండలదేవి చెరువుతో పాటు ధర్మసముద్రం, తుర్కల చెరువు అలుగు పారాయి. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా చెరువు నిండకపోవడంతో బోరుబావులు అడుగంటి అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రైతులు సంతోషిస్తున్నారు.

### ఉప్పొంగిన పెద్దవాగు

కొల్లాపూర్, జూన్ 7 : కొల్లాపూర్ మండలంలో గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి నార్లాపూర్-ముక్కిడిగుండం గ్రామాల మధ్యనున్న పెద్దవాగు ఉప్పొంగింది. దీంతో ఇరు గ్రామాల ప్రజలు శుక్రవారం వాగును దాటేందుకు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసిన ప్రతిసారి పెద్దవాగును దాటేందుకు ముక్కిడిగుండం ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి టెండర్లు వేస్తున్నారు తప్పా.. పనులు మాత్రం జరగడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వెంటనే పెద్దవాగుపై వంతెనను నిర్మించాలని ముక్కిడిగుండానికి చెందిన సీపీఎం నాయకుడు అశోక్ శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

### ఉండవెల్లిలో భారీ వర్షం

ఉండవెల్లి, జూన్ 7 : మండలంలోని పుల్లూరు, అలంపూర్ చౌరస్తా, బొంకూరు ఉండవెల్లి, తక్కశిల, భైరాపురం గ్రామాల్లో శుక్రవారం సాయత్రం భారీ వర్షం కురిసింది. సాయత్రం 5గంటలకు మొదలై రాత్రి 7 గంటల వరకు కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పుల్లూరు కుమ్మరివీధిలోని ప్రధాన కాల్వపై వరద నాలుగు అడుగుల మేర ప్రవహించింది. దీంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా గ్రామాల్లో 2.6సెం.మీ.ల వర్షపాతం నమోదు కాగా అలంపూర్ చౌరస్తా, పుల్లూరులో 4.2 సెం.మీ.ల వర్షపాతం నమోదైనట్లు మండల గణాంక అధికారి హరికృష్ణ తెలిపారు.


ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులోని పంటపొలాల్లో నిలిచిన వర్షపు నీరు

### జూరాలకు స్వల్ప వరద

ధరూరు, జూన్ 7 : అక్కడక్కడ కురుస్తున్న వర్షాలకు జూరాల ప్రాజెక్ట్‌లోకి వరద చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 1, 588 క్యూసెక్కుల వరద చేరినట్లు వారు పేర్కొన్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 318.516 మీటర్లలో 1,045 అడుగులకు గానూ ప్రస్తుతం 315.140 మీటర్లలో 1,033.92 అడుగులకు చేరినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

### ఆర్డీఎస్‌కు ..

అయిజ, జూన్ 7 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. ఎగువన కురిసిన వర్షాలకు శుక్రవారం 4,329 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సుంకేసుల బ్యారేజీకి 4,329 క్యూసెక్కులు చేరుతున్నట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.4 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

### టీబీ డ్యాంకు..

ఎగువ ప్రాంతాల్లో అడపాదడపా కురుస్తున్న వానలతో కర్ణాటకలోని టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 2,190 క్యూసెక్కులు ఉండగా, 10 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. టీబీ డ్యాం 100.855 గరిష్ట నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 3.817 టీఎంసీల నిల్వ ఉన్నది. 1,633 అడుగులకు గానూ ప్రస్తుతం 1,578.57 అడుగులకు చేరినట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.


నార్లాపూర్ వద్ద ఉప్పొంగిన పెద్దవాగు


ఉమామహేశ్వరంలో జలపాతం

### కనువిందు చేస్తున్న జలపాతం

అచ్చంపేట రూరల్, జూన్ 7 : మండలంలోని ఉమామహేశ్వర వాటర్ ఫాల్స్ కనువిందు చేస్తున్నాయి. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు నల్లమల కొండలపైకి నీరు చేరుకున్నది. ఈక్రమంలో ఉమామహేశ్వర ఆలయం చుట్టూ కమ్ముకున్న కొండలపై వందల మీటర్ల ఎత్తు నుంచి వర్షపు నీరు ఆలయ పరిసరాల్లోకి జాలువారుతున్నది. ఈ దృశ్యాన్ని చూసిన భక్తులు ఉప్పొంగిపోతున్నారు. కొండల మీదుగా చెట్ల మధ్య నుంచి నీరు జలపాతంగా జాలువారుతుండడంతో భక్తులు పరవశించిపోతున్నారు. శుక్రవారం స్వామివారి ఆలయానికి వచ్చిన భక్తులు జలపాతం వద్ద స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. నిత్యాన్నదానంలో వెయ్యిమంది పాల్గొన్నట్లు ఆలయ చైర్మన్ సుధాకర్ తెలిపారు.


పుల్లూరులో ఇండ్ల మధ్య పారుతున్న వర్షపునీరు